కేతకీలో కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు

ఝరాసంగం, ఫిబ్రవరి 28: విజయ సంకల్పయాత్రలో భాగంగా ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అర్చకులు ఆలయ రాజగోపురం ఎదుట కేంద్రమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి రాణీరుద్రమదేవి, జిల్లా అధ్యక్షురాలు గోదావరీఅంజిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్, విశ్వనాథ్, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

శ్రీకాంతాచారి విగ్రహావిష్కరణ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28: నారాయణఖేడ్‌లో బుధవారం మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, ఓబీసీ జాతీయ కమిషన్ సభ్యుడు తల్లోజీ ఆచారి, మున్సిపల్ చైర్మన్ ఆనందస్వరూప్ శెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్, బీజేపీ నేత సంగప్ప మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువకుల త్యాగం మరువలేనిదన్నారు. వారి పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. శంకరమ్మ మాట్లాడుతూ శ్రీకాంతచారి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం చొరవచూపాలని కోరారు.


ఖేడ్‌లో శ్రీకాంతాచారి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, నాయకులు

స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28: భారతీనగర్‌ను స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో భారతీనగర్ డివిజన్‌లో గార్బేజ్ టిప్పర్లను తగ్గించడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయని మేయర్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మేయర్ భారతీనగర్ డివిజన్‌కు ఆర్‌ఎఫ్‌సీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో బుధవారం రాంకీ సిబ్బంది కార్పొరేటర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

మ్యాక్‌సొసైటీలోని భెల్‌కి సంబంధించిన ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఆర్‌ఎఫ్‌సీ వాహనంతో తొలిగించి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో రాంకీ సర్కిల్ ఇన్‌చార్జి సుమన్, సూపర్‌వైజర్ అనిల్ ఉన్నారు.

రాంకీ సిబ్బందితో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

సిద్ధి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 28: సంకష్టహర చతుర్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని సిద్ధి వినాయక ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం నుంచే రేజింతల్, చీకూర్తి, హద్నూర్ సిద్ధి వినాయక ఆలయాల్లో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అలయ ట్రస్టు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించడంతోపాటు అర్చకులు శాస్త్రోక్తంగా బుద్ధి, సిద్ధిలతో సిద్ధివినాయక స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం మహిళలు స్వామివారితో పాటు సిద్ధి, బుద్ధి అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

కోహీర్, ఫిబ్రవరి 28: మార్చి 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే బడంపేట రాచన్నస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఆలయ ఈవో, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ ఈవో, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, శివానంద్, జగదీశ్వర్‌స్వామి, దయానంద్ పాటిల్, అశోక్, రాజు, చంద్రప్ప, నాగేశ్, శ్రీపాల్, యాదయ్య, అంజయ్య, భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్

సీసీ రోడ్డుకు నిధులు మంజూరు

చౌటకూర్, ఫిబ్రవరి 28: మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో సీసీ రోడ్డుకు ఈజీఎస్ కింద రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో తండాలోని ప్రధాన వీధిలో సీసీ రోడ్డు వేయనున్నారు.

ఈ పనులను బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చక్రియాల మల్లారెడ్డి ప్రారంభించారు. తండా అభివృద్ధికి వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ నిధులు మంజూరు చేశారని నాయకులు తెలిపారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బొమ్మారెడ్డిగూడెం తండాలో సీసీ రోడ్డుకు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కార్యక్రమంలో కలాలి ఈశ్వర్‌గౌడ్, రఘునాయక్, గణపతినాయక్, రవీందర్‌నాయక్, హరిసింగ్, పీనా పాల్గొన్నారు.

జిన్నారం : విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా హాలోకి పంపిస్తున్న అధ్యాపకులు

హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

సెయింట్ ఆంథోని కళాశాల వద్ద విద్యార్థులను చెక్‌చేస్తున్న అధికారులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- హాజరైన 17,988 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ క్రాంతి

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 18,780 మంది విద్యార్థులకు మొదటి రోజు 17,988 మంది హాజరయ్యారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికలు), శ్రీతేజ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు అనగానే ఆందోళన పడకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు. జిల్లాలో 782 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాని సూచించారు. మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, తాసీల్దార్ దేవదాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత ఉన్నారు.

- సంగారెడ్డి, ఫిబ్రవరి 28

పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

రాళ్లకత్వలో పడిపూజ

జిన్నారం, ఫిబ్రవరి 28 : మండలంలోని రాళ్లకత్వలో బుధవారం జ్యోతిర్లింగ మహా శివ పడిపూజ వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఆంజనేయులు గౌడ్, అనిల్ గౌడ్ నిర్వహించిన మహా శివ పడిపూజకు జడ్పీవైస్‌చైర్మన్ ప్రభాకర్ హాజరయ్యారు. కొండకంచి, ఊట్ల మాజీసర్పంచ్‌లు శెట్టి శివరాజ్, కొరివి ఆంజనేయులతో కలిసి ప్రభాకర్ మహ పడిపూజలో పాల్గొని పూజలు చేశారు. శివుడి కృపతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, శేఖర్‌రెడ్డి, శివస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అవార్డు

మునిపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని మేళసంగం జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మంతురి బుజంగానికి 'నౌరీష్ ద చెంజర్' అవార్డు లభించిందని మునిపల్లి ఎంఈవో దశరథ్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిమండలంలో అక్షయపాత్ర 15వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రమణ ఉపాధ్యాయుడు బుజంగంకు అవార్డు అందజేసినట్లు ఎంఈవో తెలిపారు.

నౌరిష్ ద చేంజర్ అవార్డుతో ఉపాధ్యాయుడు బుజంగం

మత్స్యశాఖ భవనానికి విరాళం

జిన్నారం, ఫిబ్రవరి 28 : మండలంలోని ఊట్ల గ్రామంలో నిర్మిస్తున్న మత్స్యశాఖ భవనానికి ఎల్లమ్మగూడెం మాజీసర్పంచ్ రవీందర్ రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం తన నివాసంలో మత్స్యశాఖ సంఘం సభ్యులకు నగదును అందజేశారు. భవన నిర్మాణానికి సాయం అడిగిన వెంటనే విరాళం అందించడంపై సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మహేశ్, సత్యనారాయణ, రాజు, మల్లేశ్, పెద్దశ్రీను, కృష్ణ, శ్రీను, భిక్షపతి, శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో చోరీ

అందోల్, ఫిబ్రవరి 28: తాలెల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ఆరోగ్యకేంద్రాన్ని మూసివేసిన తర్వాత తాళాలు పగులగొట్టిన దొంగలు లోపలికి ప్రవేశించి కంప్యూటర్, మానిటర్, సామగ్రి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

యువత భాగస్వామ్యం కావాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి 28: దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని 33వ బెటాలియన్ సుబేధార్ మేజర్ రాంహరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో యువజన వ్యవహారాలు-క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్‌వైకేఎస్ ఆధ్వర్యంలో యువత పార్లమెంటరీల నిర్మాణం, కూర్పు, నిర్వహణ, యువత భాగస్వామ్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం, చట్టాలపై మెరుగైన జ్ఞానం సంపాందించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యువజన అధికారి రంజిత్‌రెడ్డి, కిరణకుమార్, మాలిబర్ సింగ్, రాకేశ్ కేసీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పల్లవి, కల్పన, జగదీశ్, పద్మజ, సిద్దులుపాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించారు. నందికంది ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను ఎంఈవో అంజయ్య పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ బాల్య దశ నుంచే విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వారం రోజుల పాటు భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

- సంగారెడ్డి న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 28

సదాశివపేట : విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో అంజయ్య

బొల్లారం : సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

చౌటకూర్ : జేఎన్టీయూలో సైన్స్ డేను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

ఝరాసంగం : విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి అభినందిస్తున్న తహసీల్దార్ సంజీవరావు

రామచంద్రాపురం : విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

సంగారెడ్డి కలెక్టరేట్ : తారాలో సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తున్న భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రతన్ కుమార్


అందోల్ : జోగిపేట కేంబ్రిడ్జ్ పాఠశాలలో సైన్స్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోర్టు కేసులో ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తున్నారు..

పటాన్‌చెరు, ఫిబ్రవరి 28: కోర్టు కేసులో ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తున్నారని పటాన్‌చెరు మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఇంద్రేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వే నెంబర్ 181 సాయి ల్యాండ్ స్కెప్ వెంచర్‌లో 440గజాలు, 213 గజాలను 2013లో కొన్నానని తెలిపారు. దానికి ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 180లో పార్వతీపురం వెంచర్‌ను వేశారని తెలిపారు. పార్వతీపురం వెంచర్‌లో ఉన్న స్థలానికి మించి ప్లాట్లు చేసి విక్రయించారన్నారు. దీంతో తన ప్లాటును పార్వతీపురం వెంచర్‌లో కొనుగోలు చేసిన వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తన స్థలం సర్వే నెంబర్ 181లో ఉంటే, వారు 180గా భావించి తనను ఇబ్బందులపాలు చేస్తున్నారని చెప్పారు.

తాను కోర్టుకెళ్లి సర్వేలు, కోర్టు కమిషన్‌ను నియమించుకుని సర్వే చేయించానన్నారు. ఈ సర్వేల్లో స్థలం తనదేనని తేలిందన్నారు. వాటి తాలూకూ రికార్డులున్నాయన్నారు. పార్వతీపురం వెంచర్‌లో ప్లాటు కొన్నవారు కోర్టు కమిషన్‌ను ఏర్పాటు చేసుకుని సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ స్థలం వారికి కోర్టు ద్వారా వస్తే వదులుకుంటానన్నారు. తనదని రికార్డుల పరంగా తేలినా స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తుంటే 100కి కాల్ చేసినా, పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరు దౌర్జన్యంగా ప్లాట్లలో నిర్మాణాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తనను ప్లాట్ వద్దకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారని, అదే అపోజిషన్ వ్యక్తులు పనులు చేస్తున్నా నిలువరించడం లేదన్నారు.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28: భెల్ పరిశ్రమలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలు చేసిన భెల్ ఉద్యోగిని ఆర్సీపురం పోలీసులు అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శశికాంత్‌రెడ్డి కథనం ప్రకారం..బీహెచ్ ఈఎల్ పరిశ్రమలో సత్యసీల్ అనే వ్యక్తి 2010 లో అర్టిజన్ విభాగంలో ఉద్యోగిగా చేరాడు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉండే పలువురికి భెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 5.40లక్షలు వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చిన వాళ్లకు ఉద్యోగాలు ఇప్పించకుండా ఫేక్ జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సత్యసీల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బంగారు గొలుసు కాజేసిన దుండగులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28: వృద్ధుడిని మాటల్లో బెట్టి బంగారు గొలుసును కాజేసిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

పోలీసులు కథనం ప్రకారం.. భెల్ విశ్రాంత ఉద్యోగి విశ్వేశ్వర్‌రావు ఆర్సీపురం డివిజన్‌లోని మయూరినగర్‌లో ఉంటున్నాడు. మంగళవారం సాయం త్రం వాకింగ్ చేస్తుండగా కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆయనతో ఆంగ్లంలో మాట్లాడుతూ తమ వద్ద విదేశీ కరెన్సీ ఉన్నదని, వాటిని ఇండియన్ కరెన్సీలోకి మార్చుకోవాలన్నారు. మీ వద్ద ఇండియన్ కరెన్సీ ఎలా ఉంటుందో చూపించండి అని అడగటంతో విశ్వేశ్వరావు రూ. 500 నోటును వాళ్లకు ఇచ్చాడు. ఫంక్షన్‌కెళ్తున్నాం గిఫ్ట్‌గా గోల్డ్ చైన్ కొనాలి..మీ చైన్ చూపించండి అని అడిగారు. ఆయన చైన్ తీసి దుండగులకు ఇచ్చాడు. చైన్‌ని చూస్తున్నట్లు నటించి ఒక కవర్‌లో నకిలీ చైన్‌ను పెట్టి అతడికిచ్చి వెళ్లిపోయారు. ఆ తర్వాత తేరుకున్న ఆయన కుటుంబ సభ్యులతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో రెండు గ్యారెంటీలను త్వరలో అమలు చేస్తాం

జిన్నారం, ఫిబ్రవరి 28 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మరోరెండు హామీలను అమలు చేయడంపై కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. సోలక్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ సంబురాలు నిర్వహించారు. జిన్నారంలో ఎంపీటీసీ లావణ్యానరేశ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, జానాబాయి, సురభీనాగేందర్‌గౌడ్, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, అశోక్, జయప్రకాశ్, రాజుగౌడ్, రవీందర్, భాస్కర్, ఆది మల్లేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON-OURABLE JUNIOR CIVIL JUDGE AT: ZAHEERABAD
O.S.No. 67 OF 2022
Between:
Bakkamma @ Vani
... Petititoner/Plaintiff
And
Narsamma & Others
... Respondents/Defendants
PUBLIC NOTICE
To
D1: Narsamma W/o Late Bhawani, Aged about 76 Years, Occ: Household, R/o. Chinthalghat Village, Koheer Mandal, Sangareddy District.
D2. Narsimulu S/o Late Bhawani, Aged about 50 Years, Occ: Agriculture, R/o. Chinthalghat Village, Koheer Mandal, Sangareddy District.
Take notice that Petitioner filed the above Suit for partition and separate possession the against Your's i.e Defendant No.1 & 2 before the said Hon'ble court. The case is posted on 01.03.2024. for appearance before the said court on the said date at 10.30 a.m. if anyone has any claim or objection appear before Honourable Junior civil Judge Court At Zahirabad on above said date and time by person or through Advocate, otherwise on the said date and time before the said court the case will be decided as per law.
//BY ORDER OF THE COURT//
Sd/- G. SRINIVAS REDDY, Advocate,
Plot No. 30, Venkaramana Colony,
Sangareddy, Dist. T.S. Cell: 8008218113
Date: Place : Zahirabad

డాక్యుమెంట్ పోయినది
జక్కుల మల్లేష్, తండ్రి జక్కుల విట్టల్, R/o.నారాయణఖేడ్ గ్రామం,నారాయణఖేడ్ మండలం, సంగారెడ్డి జిల్లా వాసినైన నేను తేది: 19-02-2024 రోజున సంగారెడ్డి నుండి నారాయణఖేడ్‌కు RTC బస్సులో ప్రయాణిస్తుండగా మార్గ మధ్యలో నా యొక్క ORIGINAL రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నం. 3780/2016గలది పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు- 9010082952.